ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 18 జూన్ 2025



5వ తేదీన ఉపలోకాయుక్త వీరప్ప పరిశీలన

అవినీతి అధికారులపై సుమోటోగా కేసు

● పలువురికి నోటీసులు జారీ

బంగారపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి అక్రమంగా ఆర్జించిన అధికారులపై లోకాయుక్త సుమోటోగా కేసులు నమోదు చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం పలువురికి నోటీసులు జారీ చేశారు. ఈనెల 5న ఉపలోకాయుక్త వీరప్ప తాలూకాలోని వివిధ కార్యాలయాలను సందర్శించిన వేళ పలువురు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో లోపాలను, యూపీఐ ద్వారా అత్యధిక లావాదేవీలు జరిపినట్టు గుర్తించారు. ఈ మేరకు మొత్తం 34మందిపై సుమోటోగా కేసులు నమోదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం డేటా ఎంట్రీ ఆపరేటర్ విజయ్‌కుమార్ ఆఫీసు పనివేళల్లో ఎక్కువగా ఉండేవారు కాదని, ప్రజలనుంచి లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణల మేరకు నోటీసులు ఇచ్చారు.

ఆదాయానికి మించి లావాదేవీలు

తాలూకాలో విధి నిర్వహణలో ఉన్న అధికారులు తమ పరిధిలోని సిబ్బంది ద్వారా ప్రజలనుంచి అధికమొత్తాల్లో నగదు పొందినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ఊతమిచ్చేలా ఉపలోకాయుక్త అధికారులు దాఖలు చేసిన సుమోటో కేసులో తాలూకాలోని అనేకమంది కిందిస్థాయి సిబ్బంది పేర్లు ఉండడం ఆశ్చర్యానికి కారణమవుతోంది. తాలూకా పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న షార్ట్‌హ్యాండ్ రైటర్స్, భూ రికార్డుల సహాయక డైరెక్టర్ పరశివమూర్తి, ల్యాండ్ సర్వేయర్ త్రివేణి, తాలూకా కంప్యూటరైజ్డ్ పహణి శాఖలో విధులు నిర్వహిస్తున్న సెకండ్‌గ్రేడ్ అసిస్టెంట్ శ్రీనివాసులు మొబైల్‌లో యూపీఐ లావాదేవీలు తమ వేతనాలకు మించి చేసినట్టు గుర్తించారు. భారీ అవినీతి జరిగిందనే అనుమానంతో సుమోటోగా కేసు నమోదు చేసుకుని వీరికి సంబంధించి ఏడాది వేతనం, యూపీఐ స్టేట్‌మెంట్, వారి ఏడాది బ్యాంక్‌స్టేట్‌మెంట్ వివరాలతో పోల్చి రికార్డులతో సమగ్ర నివేదిక సమర్పించాలని, ఏడాదిలో స్థిరాస్తి, చరాస్తులకు సంబంధించిన వివరాలను కూడా సమర్పించాలని లోకాయుక్త అధికారులకు సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం


తాలూకాలోని ఏ శాఖలో బయోమెట్రిక్ హాజరు, అధికారుల ఇన్-అవుట్ నమోదు, హాజరు పుస్తకం సమగ్రంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాలూకా పంచాయతీ కార్యనిర్వాహక అధికారి రవికుమార్ అపరిమితమైన గ్రాంట్లలో కోటి రూపాయలతో చేపట్టిన పనుల వివరాలు, యాక్షన్‌ప్లాన్, అంచనా పట్టా, ఫైనల్‌బిల్, చెల్లించిన మొత్తం బిల్లుల వివరాల గురించి ఎటువంటి రికార్డులు లేవు. పనులకు సంబంధించిన మూలధనం, జీఎస్టీ, ఆదాయపన్ను గణనకు సంబంధించి ఇంజనీర్లు ఇచ్చిన నివేదిక, ఇతర రికార్డులను సమర్పించలేదు.

● కాగా పురసభ ముఖ్యఅధికారి సత్యనారాయణ తన పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, ఆక్రమణల తొలగింపులకు సంబంధించి సమాచారం కొరత ఉంది. పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తానికి వివరాలను సమర్పించడంలో పూర్తిగా విఫలమైనందుకు కేసు నమోదు చేయాలని నోటీసు జారీ చేశారు. రెవెన్యూశాఖలో బగర్‌హుకుం అర్జీలు ఏళ్ల తరబడి 45 దరఖాస్తులు, అలాగే ఖాతా చేయడానికి సంబంధించి 239 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని వివరించాలని కోరుతూ తహసీల్దార్ వెంకటప్ప, సెకండ్‌గ్రేడ్ అసిస్టెంట్ తేజస్వినికి నోటీసులు జారీ అయ్యాయి.

23 లక్షల మంది పింఛన్లపై వేటు..!



● అనర్హులను గుర్తించిన ప్రభుత్వం
● తొలగించాలని రెవెన్యూశాఖకు ఆదేశం



బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రతా పథకంలో భాగంగా నిస్సహాయులు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతోపాటు ప్రమాదాలలో అవయవాలు కోల్పోయినవారికి నెలవారీ అందించే పింఛన్లలో భారీగా అక్రమాలు ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న నెలవారీ పింఛన్లలో 23.19 లక్షలమంది అనర్హులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అనర్హులను జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూశాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రాంతాలవారీగా అనర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

● పింఛన్లు, బీపీఎల్ కార్డులు పొందడమంటే నిత్యావసరాలకోసం కాకుండా ప్రభుత్వ సంక్షేమాలు ప్రత్యేకించి ఆసుపత్రిలో ఉచిత వైద్యసేవలు పొందవచ్చని ఎక్కువమంది ఆసక్తి చూపుతారు. బీపీఎల్ కార్డు ఉంటేనే సామాజిక భద్రత పింఛన్లు, గ్యారెంటీ పథకాలు వర్తిస్తాయని ఎన్నో కష్టాలు పడి కార్డులు చేయించుకున్నారు. బీపీఎల్ కార్డు ద్వారానే గృహలక్ష్మి, గృహజ్యోతి వంటి గ్యారెంటీలు సులభతరంగా అందుతాయి. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా సాధారణ ఫీజులు చెల్లించాలనే నిబంధన ఉంటుంది. బీపీఎల్ కార్డుదారులైతే పలు మినహాయింపులు వర్తిస్తాయి. అందుకే బీపీఎల్ కార్డులకోసం జనం ఎగబడతారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉండేవారు మాత్రమే బీపీఎల్ కార్డులకు అర్హులవుతారు. కానీ 10 ఎకరాలకుపైగా భూమి, ట్రాక్టర్‌లు, ఇతరత్రా వ్యాపారాలు ఉండేవారు ఏడాదికి రూ.2లక్షలకుపైగా వేతనాలు పొందేవారు కూడా బీపీఎల్ కార్డులు పొందుతున్నారు. దీనికితోడు ప్రభుత్వం నెలవారీ నిత్యావసర వస్తువులు తీసుకోనివారి బీపీఎల్ కార్డులను రద్దు చేయాలని యోచిస్తోంది.

● రాష్ట్రంలో 65ఏళ్లు పైబడిన వృద్ధులు ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగించేందుకు సంధ్యాసురక్షా పథకం కింద నెలకు వెయ్యిరూపాయలు పింఛను ఇస్తారు. ఇదే తరహాలోనే 60 ఏళ్లు పైబడిన వారికి వృద్ధాప్యపింఛను కింద 800 రూపాయలు ఇస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ల పథకం కింద 21.87 లక్షల మంది, సంధ్యాసురక్షా పథకం కింద 31.33 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ఉంది. అయితే గణాంకాలకంటే ఎక్కువమంది పింఛన్లు పొందుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం లబ్ధిదారులు, కుటుంబ వివరాలకు అనుగుణంగా పరిశీలనలు జరిపింది. వయస్సు తక్కువ ఉన్నా... ఎక్కువగా చూపడం, శ్రీమంతులు, ఏపీఎల్ కార్డుదారులు, ఆదాయపన్ను చెల్లించేవారు, ప్రభుత్వరంగ సంస్థలలో రిటైరైనవారి గణాంకాలను పరిశీలిస్తే భారీగా అనర్హులు ఉన్నట్లు బయటపడింది. వృద్ధాప్య పింఛనులో 9.04 లక్షల మంది, సంధ్యాసురక్షా పథకం కింద 14.15 లక్షలమంది అనర్హులు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది.

తహసీల్దార్లకు సూచన

● గ్రామాలవారీగా అనర్హులైన జాబితాలను జిల్లాయంత్రాంగం సిద్ధం చేసింది. సదరు జాబితాను రెవెన్యూశాఖకు అనుబంధమైన తహసీల్దార్లకు పంపారు. అనర్హులుగా గుర్తించిన వారిని స్వయంగా రెవెన్యూ అధికారులు కలసి వయస్సు, వారి ఆదాయం, బీపీఎల్ లేదా ఏపీఎల్‌కార్డు, ఆదాయపన్ను చెల్లించిన విధానం, హెచ్‌ఆర్‌ఎంఎస్ మార్గదర్శకాలను బట్టి పరిశీలిస్తారు. ఆ తర్వాత లబ్ధిదారులను ఎందుకు అనర్హులుగా చేశారనేది వివరిస్తారు. ఇలా ప్రతి తహసీల్దారు పరిధిలో ప్రక్రియను కొనసాగించాలని ప్రభుత్వం సూచించింది.

● సామాజికభద్రతా పథకంలో భాగంగా పింఛన్లకు అనర్హులను చేర్చే విషయంలో స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడి అధికంగా ఉంటుంది. స్థానికంగా ఓట్లు పొందేందుకు అర్హత లేకున్నా పలుకుబడితో జాబితాలో చేర్చారు. నగరాలు, పట్టణాలలో ఎక్కువమంది అనర్హులు ఉంటారు. బాడుగ వచ్చే ఇళ్లు, ప్రభుత్వ పెన్షన్లు, ఐటీ చెల్లింపులు ఉన్నా పింఛన్లు పొందుతుంటారు. గడిచిన నాలుగేళ్లుగా పింఛన్లకు ఆధార్, పాన్ కార్డు తప్పనిసరి చేయడంతో కొత్తగా లబ్ధిపొందేవారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఆధార్‌లోని వయస్సు, పింఛను దరఖాస్తుకోసం చేసుకున్న అర్జీలో వయస్సులో తేడా ఉంటే వాటిని స్వీకరించడం లేదు.

అనర్హులను గుర్తించిన విధానం..

హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (హెచ్‌ఆర్‌ఎంఎస్) ద్వారా అనర్హ పింఛనుదారులను గుర్తించారు. ఆదాయపు పన్ను చెల్లించేవారి జాబితాను క్రోడీకరించి పరిశీలించారు. ఆధార్‌కార్డుల వివరాల ఆధారంగా వయస్సులో స్పష్టతను నిర్ధారించారు. కుటుంబీకుల వివరాలను సాంకేతికంగా సేకరించి విశ్లేషణలతో ఆధారాలు సేకరించారు. ఇలా నాలుగు విధాలుగా సమాచారాన్ని సేకరించి సామాజిక పింఛన్లు పొందుతున్న వారితో పోల్చారు.

● అనర్హులైన పింఛనుదారులను గుర్తించడం ద్వారా ఖజానాకు భారీగా సొమ్ము మిగలనుంది. అర్హులకు మాత్రమే లబ్ధి చేకూరనుంది. పింఛన్ల పథకం దుర్వినియోగం కాకుండా కట్టడి చేసినట్టు అవుతుంది. అర్హత కల్గిన కొత్త లబ్ధిదారులకు అనుకూలం కానుంది. పాలనాయంత్రాంగంపై భారం తగ్గించి, సామాజికభద్రతా పథకంలో భాగంగా కేంద్రం వాటా అత్యల్పం. వెయ్యి కోట్ల రూపాయలు కేంద్రం భరిస్తే 9వేల కోట్లు రాష్ట్రప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అనర్హులను తొలగించడం ద్వారా భారీ స్థాయిలో ఖజానాకు ఆదాయం చేకూరనుంది.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రామకృష్ణన్, డాక్టర్ వెంకటేశ్

డసాల్ట్ సిస్టమ్‌తో రామయ్య వర్సిటీ ఒప్పందం

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): డసాల్ట్ సిస్టమ్, రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌లు ఒప్పందం చేసుకున్నాయి. అడ్వాన్స్‌డ్ ప్రొడక్ట్ డెవలెప్‌మెంట్, పరిశోధనా రంగాల్లో సంయుక్తంగా పని చేయదలిచాయి. ఈమేరకు మంగళవారం డసాల్ట్ సిస్టం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రామకృష్ణన్ వెంకటరామన్, రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ (ఆర్‌యూఏఎస్) రిజిస్ట్రార్ డాక్టర్ జీఎస్ వెంకటేశ్ గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం సమక్షంలో ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ త్రీడీ డిజైన్ ఇంజనీరింగ్, సిమ్యులేషన్ టెక్నాలజీ విభాగంలో డసాల్ట్ సిస్టమ్స్ గ్లోబల్ స్థాయిలో పేరొందిందన్నారు. రామయ్య వర్సిటీ విద్యార్థులకు పరిశోధనలు, ఆవిష్కరణల విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చేందుకు ఒప్పందం భవిష్యత్తుకు మేలు చేకూర్చనుందన్నారు. అడ్వాన్స్‌డ్ ప్రొడక్ట్ డెవలెప్‌మెంట్, పరిశోధనల కేంద్రాన్ని క్యాంపస్‌లో ప్రారంభిస్తామన్నారు. రామయ్య విద్యార్థులకు ప్రపంచస్థాయి సాంకేతిక నైపుణ్యత కల్పించడమే లక్ష్యంగా ఒప్పందం చేసుకున్నామన్నారు. ఆర్‌యూఏఎస్ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కేకే రైనాతోపాటు పలువురు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పాఠ్యాంశం చేస్తాం

● ప్రకృతి రక్షణ అందరి బాధ్యత: సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ఉన్నతవిద్యలో పాఠ్యాంశం చేస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి, అటవీ, పర్యావరణశాఖలు సంయుక్తంగా పర్యావరణ దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని ప్యాలెస్‌మైదానంలో నిర్వహించాయి. కాలుష్యనియంత్రణ మండలి చైర్మన్ నరేంద్రస్వామి అధ్యక్షత వహించగా డీసీఎం డీకే శివకుమార్, అటవీ శాఖమంత్రి ఈశ్వర్‌ఖండ్రె ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఎం, డీసీఎంలు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందచేశారు. విద్యార్థులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ ప్రకృతి రక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం నియంత్రణ తప్పనిసరి అయ్యిందని, వాటిని సంపూర్ణంగా నిషేధించాల్సి ఉందన్నారు. మహాత్మాగాంధీ ప్రకృతి మనిషి, ఆయన ఆశయాలను నెరవేరుస్తుందని అభిప్రాయపడ్డారన్నారు. ప్రకృతి వైవిధ్యంగా పశ్చిమకనుమలు, నదులు, అటవీప్రాంతాలు, భూమిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బెంగళూరులో జనాభా 1.44 కోట్లకు పెరిగిందని, అందుకు అనుగుణంగా రోజూ 900 టన్నుల వ్యర్థాలు ఉత్పన్నమవుతాయన్నారు. జనాభా పెరిగితే పర్యావరణానికి నష్టమే అన్నారు. జనాభా నియంత్రణ కూడా అవసరమే అన్నారు. ప్రస్తుతం 43శాతం సేంద్రియసాగు తగ్గిందని, ఇదే పరిణామం కొనసాగితే మరికొన్నేళ్లలో భూమి పూర్తిగా కలుషితం అవుతుందన్నారు. భూమిలో కరిగిపోని ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయమైన వాటిని వాడాలన్నారు. చెట్లు పెంచాలన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ బెంగళూరు నగరాభివృద్ధి బాధ్యతలు చేపట్టాక ప్రతి పాఠశాలలోనూ క్లైమేట్ యాక్షన్ క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యార్థి మొక్క నాటి సంరక్షించాలనేది సందేశమన్నారు. అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులకు గడిచిన కొన్నేళ్లుగా ప్రకృతిపై జరుగుతున్న అవాంతరాలే కారణమన్నారు. రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 8.5 కోట్ల మొక్కలు నాటామని, ఈ ఏడాది 3 కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4వేల కోట్ల విలువైన అటవీభూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. అడవులను రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. అధ్యక్షత వహించిన నరేంద్రస్వామి మాట్లాడుతూ 'ఎండ్ ప్లాస్టిక్ పొల్యూషన్' నినాదంతో ఈ ఏడాది పర్యావరణ దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. మూడు నెలలపాటు ప్రజల సహకారంతో కాలుష్య నియంత్రణపై జిల్లాలవారీగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించదలిచామన్నారు. ఇదే సందర్భంగా పర్యావరణంపై ప్రతిజ్ఞ చేశారు. రీజియన్ల వారీగా పర్యావరణ పరిరక్షణ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు దినేశ్‌గుండూరావు, బైరతి సురేశ్, డాక్టర్ కే సుధాకర్‌తోపాటు అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అంజుం పర్వేజ్ సహా పలువురు అధికారులు, వేలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఉదయం పర్యావరణ వాకథాన్, సైక్లింగ్‌ను విధానసౌధ వద్ద ప్రారంభించారు. వాకథాన్‌లో ప్లకార్డులను ప్రదర్శించారు.



పురస్కారాలను అందుకున్న పర్యావరణవేత్తలతో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు



విధానసౌధ వద్ద వాకథాన్‌లో ప్లకార్డులతో ప్రదర్శనలో డీసీఎం డీకేశివకుమార్, మంత్రి ఈశ్వర్‌ఖండ్రె తదితరులు



ప్రసంగిస్తున్న ప్రతిపక్షనేత అశోక్



పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు

హడావుడే... తొక్కిసలాటకు కారణం

● బాధ్యత వహించి రాజీనామా చేయండి ● సీఎం, డీసీఎం, హోం మంత్రులకు బీజేపీ నేతల డిమాండ్

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టోర్నీలో ఆర్సీబీ విజయోత్సవాలు హడావుడిగా జరపడమే తొక్కిసలాటకు కారణమని బీజేపీ మండిపడింది. రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో ఫ్రీడంపార్కులో నిరసన చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన సాగింది. పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ఈ నెల 3న అర్ధరాత్రి జట్టు విజయం సాధించిందన్నారు. రాత్రంతా పోలీసులు గస్తీ నిర్వహించారన్నారు. బెంగళూరు నగర వ్యాప్తంగా తెల్లవారే దాకా ఎటుచూసినా సంబరాలు కొనసాగాయన్నారు. 4వ తేదీ మధ్యాహ్నానికే విధానసౌధ, చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాలు జరుపుతున్నట్టు ప్రకటించారన్నారు. 17ఏళ్ల తర్వాత జట్టు గెలుపొందడంతో అభిమానులలో ఎనలేని ఉత్సాహం నెలకొందన్నారు. గెలుపొందిన జట్టు బెంగళూరుకు వస్తోందనే సమాచారంతో లక్షలమంది చేరారన్నారు. కనీస జాగ్రత్తలు ప్రభుత్వం పాటించలేదన్నారు. పోలీసులు వెనుకడుగు వేస్తున్నా జరపాల్సిందేననే ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. తగినంత పోలీసు బందోబస్తు లేకపోవడమే ఏకంగా 11మంది మృతికి కారణమైందన్నారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ క్రీడాకారులు సైతం విధానసౌధనుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎవరికోసం ఈ హడావుడి చేశారని ప్రశ్నించారు. డీకే శివకుమార్ షీల్డును పైకెత్తి ఆయనే సాధించినట్టుగా వ్యవహరించారన్నారు. 11 కుటుంబాల శాపం ప్రభుత్వానికి తగలనుందన్నారు. తొలుత విధానసౌధ, ఆ తర్వాత చిన్నస్వామి స్టేడియంకు రావాలంటూ పిలుపునిచ్చారన్నారు. తప్పు ప్రభుత్వం చేసి అధికారులను బలిపశువులను చేశారన్నారు. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ కార్యక్రమం వద్దంటూ పోలీసుశాఖ సూచించినా ప్రభుత్వం ఏదో సాధించినట్టుగా వ్యవహరించిందన్నారు. 11మంది మృతికి కారకులైన సీఎం సిద్దరామయ్య డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా ఫ్రీడంపార్కు నుంచి సీఎం నివాసాన్ని ముట్టడిచేందుకు ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ సీఎం, డీసీఎంల పిచ్చిచేష్టలతో 11మంది మృతి చెందారన్నారు. సిగ్గులేని ప్రభుత్వమని, నైతిక బాధ్యతతో వెంటనే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఎం నివాసంవైపు వెళ్లేందుకు ప్రయత్నించగా విజయేంద్ర, అశోక్, చలవాదితోపాటు ఎంపీలు గోవిందకారజోళ, పీసీ మోహన్, ఎమ్మెల్యేలు బైరతి బసవరాజ్, గోపాలయ్య, రవిసుబ్రమణ్య ఉదయ్ గరుడాచార్, మునిరాజ్, కృష్ణప్ప, రవికుమార్, కేశవప్రసాద్‌తోపాటు పలువురిని అరెస్టు చేశారు. నిరసనకు భారీగా జనం తరలివచ్చారు.

డీఎస్సీ పరీక్షలు వాయిదా

కొత్తచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాల నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 1, 2 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలు, పరీక్షా తేదీలు మార్చిన హాల్ టిక్కెట్లను https//apdsc.appfas.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని ఆయన సూచించారు.

బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షుడి ఎంపిక



ద్వారకానాథ్ శర్మ

ధర్మవరం, జూన్17(ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం శ్రీసత్యసాయిజిల్లా అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన ద్వారకనాథ్‌శర్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు అఖిల భారతబ్రాహ్మణ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నుంచి ఆదేశాలు వచ్చాయి. తన ఎంపికకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ, రాష్ట్ర ప్రతినిధి అనంతకుమారి, రాష్ట్ర ఏబీబీఎం ఈడీసెల్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నరేశ్‌కుమార్‌లకు ద్వారకనాథ్‌శర్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌పై రేపు అవగాహన

అనంతపురం రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే ఐటీ, పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19న పాలిసెట్-2025 వెబ్ కౌన్సెలింగ్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైభవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు.

నిష్ణాతులైన పాలిటెక్నిక్ ప్రొఫెసర్లు.. ధ్రువపత్రాల పరిశీలన, వెబ్‌కౌన్సిలింగ్‌లోని సమస్యలు, ఆన్‌లైన్‌లో కళాశాల ఎంపిక, కౌన్సిలింగ్ విధానం వంటి వాటి గురించి వివరిస్తారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుకు హాజరయ్యే వారి కోసం ఆర్టీసీ బస్టాండు నుంచి ఉదయం 9గంటలకు ఉచిత కాలేజీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9848471460, 8886621123, 8886621124, 8886630024 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అమ్మ చేతికి సొమ్ము



డబ్బులు తీసుకునిగానీ వెళ్లేది లేదు..!





నా చదువులకే కదమ్మా..?



ఇది మా విజయం..!



ఎందుకైనా మంచిది.. ఎంచుకుంటా..!



వచ్చే సంవత్సరం ఇంకో రూ.13 వేలు ఎక్కువగా వస్తాయి కదమ్మా..!



బారులు తీరిన మహిళలు.. వంతు వచ్చేందుకు ఎంత సమయం పడుతుందో.. ఏమో..!

బ్యాంకులు, పోస్టాఫీసు నుంచి డ్రా

తల్లికి వందనం సొమ్మును డ్రా చేసేందుకు వచ్చే మహిళలతో బ్యాంకులు, పోస్టాఫీసులు కిటకిటలాడుతున్నాయి. అనంతపురం హెడ్ పోస్టాఫీసు వద్ద వందలాది మంది మంగళవారం బారులు తీరారు. తపాలా శాఖ సిబ్బంది వారి ఖాతాలో జమ అయిన నగదు అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ అయిన సొమ్మును చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక బిడ్డ ఉంటే రూ.13 వేలు.. ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురికి రూ.39 వేలు, నలుగురికి రూ.52 వేలు.. ఇలా ఎంత మంది పిల్లలు ఉంటే అంత ఎక్కువ నగదు అమ్మచేతికి అందింది. నగదు సరిగా ఉందో లేదో అక్కడే కూర్చుని మహిళలు లెక్కబెట్టుకున్నారు. ఎవరెవరికి ఎంత వచ్చిందో క్యూలో ఉన్నవారు చర్చించుకుంటూ సందడిగా గడిపారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య



రెండు రోజులైనా జనం తగ్గనేలేదక్కా..! మన వంతు ఎప్పుడొస్తుందో ఏమో..!



ఎంతమంది పిల్లలక్కా..? అందరికీ వచ్చిందా..?

హలో.. రెడీగా ఉన్నారా..?

ఆన్‌లైన్‌లోకి రండి.. వివరాలు చెప్పండి

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం వైద్యం, జూలై 17(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయం వచ్చేందంటే జిల్లా కేంద్రానికి రావాల్సిందే. ఇది ఒకప్పటి పరిస్థితి. కానీ ఇప్పుడు సాకేంతికను అందిపుచ్చుకుని, ఉన్నచోటు నుంచే ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్‌కు హాజరై.. బదిలీ చేయించుకోవచ్చు. ఒక్కో ఉద్యోగి బదిలీ ప్రక్రియ ఒకటి, రెండు నిమిషాల్లోనే పూర్తి అవుతోంది.



కౌన్సెలింగ్ కోసం మెడికల్ కాలేజీలో నిరీక్షిస్తున్న నర్సులు

డీఎంహెచ్‌ఓ, వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్యాలయాల్లో బదిలీలు ఇలాగే జరుగుతున్నాయి. కౌన్సెలింగ్ ప్రారంభంకాగానే.. 'హలో.. రెడీగా ఉన్నారా..? ఆన్‌లైన్‌లోకి రండి..' అని ఉన్నతాధికారులు పిలవగానే ఉద్యోగి వీడియో కాల్‌లో ప్రత్యక్షమౌతున్నారు. తన వివరాలు, బదిలీ ఆప్షన్లు ఇస్తున్నారు. ఈ బదిలీల ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది.

కొనసాగుతున్న ప్రక్రియ

వైద్య, ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో కడప నుంచి అధికారులు జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ట్యూటర్ గ్రేడ్-2, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్, డీపీఎంఓ, ఆఫీస్ సూపరింటెండెట్, రేడియోగ్రాఫర్, పీఎంఓఓ, పీహెచ్‌ఎన్(టీచింగ్), హెడ్‌నర్స్, హెల్త్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్ కేడర్లకు మంగళవారం రాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ, డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్స్, ఎంపీహెచ్‌పీఎస్(ఫిమేల్), పీహెచ్‌ఎన్(నాన్ టీచింగ్), జూనియర్ అనలిస్ట్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, ఎంపీహెచ్‌పీఎస్(మేల్), సీనియర్ అసిస్టెంట్,ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్-2 ఉద్యోగులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.



జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా బదిలీలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

122 ఏఎన్‌ఎం పోస్టులకు..

ఉమ్మడి జిల్లాలోని 122 సబ్‌సెంటర్లలో 122 ఎంపీహెచ్‌పీఎస్-ఫిమేల్(ఏఎన్‌ఎం) పోస్టులకు బుధవారం బదిలీల ప్రక్రియ నిర్వహిస్తారు. అయితే ఏఎన్‌ఎం ట్రైనింగ్ సెంటర్‌లో వార్డెన్, తోపుదుర్తి, మరూరు సబ్‌సెంటర్స్‌లో ఏఎన్‌ఎం పోస్టులను ఖాళీలు చూపలేదు. రాష్ట్ర వైద్య, ఆర్యోశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లియర్ వేకెన్సీస్ కేటగిరిలో చేర్చడంలేదని డీఎంహెచ్‌ఓ ఆదేశాల్లో పేర్కొన్నారు.

అండర్-19 మహిళా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా అండర్-19 మహిళా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-19 మహిళా క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ప్రకటించారు. జట్టులో నేహ, హిమవర్షిణి, రోషనారా, ఛాయాశ్రీ, స్వాతి, గీతిక, గౌతమి, హన్సిరెడ్డి, ధారామోహన్, అమూల్య, నందిని, తేజశ్విని, మైత్రి, చక్రిక, ఎస్‌కే తరుణం, స్టాండ్‌బైలుగా మాన్విత, భువనేశ్వరి, యావన, నాగజ్యోతి, చైత్ర, స్రవంతి, హంస్నా హాజిరా చోటు దక్కించుకున్నారు. కోచ్‌గా నజీర్‌అహ్మద్ నియమితుడయ్యారు. ఎంపికైన జట్టు ఈనెల 19వ తేదీ నుంచి నెల్లూరులో నిర్వహించే సౌత్‌జోన్ అండర్-19 క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని భీమలింగారెడ్డి తెలిపారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

● సహజ వ్యవసాయమే మార్గం ● కరువు, ఎడారీకరణ నివారణ అత్యవసరం ● వక్తల పిలుపు



రైతులు ఏర్పాటు చేసిన సేంద్రియ పండ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్17(ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందనీ, అందుకు సహజ వ్యవసాయమే మార్గమని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ కరువులు, ఎడారీకరణ నివారణ దినం సందర్భంగా మంగళవారం స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కరువు-వాతావరణ మార్పులు-ప్రకృతి వ్యవసాయం ప్రదర్శన సదస్సు నిర్వహించారు. డీఆర్వో మలోల మాట్లాడుతూ.. రైతులు, జిల్లా ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరమన్నారు. సహజ వ్యవసాయంతో అటు నేల, ఇటు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అభివృద్ధి పర్యావరణానికి హాని కలిగించేవిధంగా ఉండకూడదన్నారు. వాతావరణాన్ని కాపాడేదిగా ఉండాలని వివరించారు. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడానికి, వాతావరణంలో వస్తున్న మార్పులను తిప్పికొట్టడానికి సహజ వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా రసాయన ఎరువులు, కలుపు మందులు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని దెబ్బతీశామన్నారు. మట్టిలోకి రసాయనాలు చేరడంతో ఆహారధాన్యాల ఉత్పాదకత దెబ్బతింటోందన్నారు. ఈ కారణంగా తలెత్తుతున్న అనేక అనారోగ్య సమస్యలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం రైతులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపాల్ విజయశంకర్ బాబు, రైతు సాధికార సంస్థ అధికారి లక్ష్మానాయక్, వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీరెడ్డి, రెడ్స్ డైరెక్టర్ భానూజ, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్రహ్మణ్యం, మిల్లెట్స్ మాధవీలత, రైతులు పాల్గొన్నారు.

నీటి నిల్వకు ఏమేం చేస్తున్నారు..?

సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల ఆరా

నేడు క్షేత్రస్థాయిలో పర్యటన

అనంతపురం అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలశక్తి అభియాన్ పనుల గురించి సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్ విచారించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు ముందుగా కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి, పలు అంశాల గురించి మంగళవారం చర్చించారు. డ్వామా పీడీ కార్యాలయంలో జలశక్తి అభియాన్ పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను సాయంత్రం సందర్శించారు. నీటిని నిల్వ కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను కమిటీ సభ్యులకు డ్వామా పీడీ సలీం బాషా, వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి వివరించారు. వాటర్ షెడ్, ఉపాధి పథకం ద్వారా చేపట్టిన అమృత్ సరోవన్ నీటి కుంటలు, ఫాం పాండ్స్ డ్రైల్యాండ్ హార్టికల్చర్, పశువుల నీటి తొట్టెలు, గొర్రెలు, మేకల షెడ్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా, వాటర్ షెడ్, కృషి విజ్ఞాన కేంద్రం, ఏపీఎంఐపీ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్షేత్రస్థాయి పర్యటన

సెంట్రల్ వాటర్ కమీషన్ కమిటీ సభ్యులు బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను బుధవారం ఉదయం 10.15 గంటలకు పరిశీలిస్తారు. చెక్ డ్యాంల పరిశీలన, చిజిల్ నాగలితో లోతు దుక్కి చేయడాన్ని పరిశీలిస్తారు. అనంతరం రైతులతో మాట్లాడతారు. తాడిపత్రిలో మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని 12 గంటలకు పరిశీలిస్తారు. ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాం పాండ్స్‌ను మధ్యాహ్నం 12.30 గంటలకు పరిశీలిస్తారు. గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫాం పాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని మధ్యాహ్నం 3.30 గంటల నుంచి పరిశీలిస్తారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను ఆ రోజు మధ్యాహ్నం పరిశీలిస్తారు.



వాటర్ షెడ్, ఉపాధి పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్

డ్వామా ఏపీఓల బదిలీ

అనంతపురం అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొమ్మిది మంది డ్వామా ఏపీఓలను బదిలీ చేశారు. ఈ మేరకు డ్వామా పీడీ సలీం బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారి వివరాలు ఇవి..

ఏపీఓ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
తులసీ ప్రసాద్	ఉరవకొండ	పుట్లూరు
సుజాత	పుట్లూరు	ఉరవకొండ
విమల	గుంతకల్లు	వజ్రకరూరు
లక్ష్మీకాంతబాయి	వజ్రకరూరు	బొమ్మనహాళ్
భాగ్యలక్ష్మి	బొమ్మనహాళ్	శింగనమల
ఓబిరెడ్డి	కుందుర్పి	యల్లనూరు
రవి	యల్లనూరు	రాయదుర్గం
విజయభారతి	రాయదుర్గం	పెద్దవడుగూరు
మల్లీశ్వరి	శింగనమల	విడపనకల్లు

దాణాను సద్వినియోగం చేసుకోండి: మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పశుదాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత సూచించారు. పట్టణంలోని పశువైద్య శాఖ కార్యాలయంలో జేడీ శుభదాస్, ఏడీ శ్రీరాములు నాయక్‌తో కలిసి రైతులకు మంగళవారం పశుదాణా పంపిణీ చేశారు. ప్రొటీన్లు పశువులకు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రైతులకు దాణా అందిస్తోందని తెలిపారు. పెనుకొండ మండలానికి 197 దాణా ప్యాకెట్లు కేటాయించామని, ఒక్కో ప్యాకెట్టు విలువ రూ.1100 కాగా సబ్సిడీతో రూ.550కే ఇస్తున్నామని తెలిపారు.

విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధన


రాయలసీమ యూనివర్సిటీ మునుపటి వీసీ నరసింహులు




సదస్సులో పాల్గొన్న వీసీ, డైరెక్టర్లు

అనంతపురంరూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధనలు సాగించాలని రాయలసీమ యూనివర్సిటీ మునుపటి వీసీ ఆచార్య నరసింహులు అన్నారు. స్థానిక జేఎన్‌టీయూలో మంగళవారం జాతీయ విద్యావిధానంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆచార్య నరసింహులు మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో అధ్యాపకులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కోర్సులు ఎంచుకునే సౌలభ్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాలి, సుబ్బారెడ్డి, సుజాత, పద్మసువర్ణ, కిర్మయి, నాగప్రసాద్‌నాయుడు, దుర్గాప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, చిత్ర శోభాబిందు, సురేష్‌బాబు, శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

కవితా పోటీల విజేతల వెల్లడి







సొరపు గోవిందరాజులు, సత్యనారాయణరాజు, పీజీ వెంకటేష్

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల విజేతల వివరాలను మంగళవారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు టీవీ రెడ్డి వెల్లడించారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని 'ఆర్డీటి సేవలు-అభాగ్యులకు వరాలు' అనే అంశంపై ఈనెల 6 నుంచి 10వతేదీ వరకు వాట్సాప్ ద్వారా కవితలను పోటీలకు ఆహ్వానించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, పుదుచ్చేరి నుంచి 131 మంది తమ కవితలను పంపారు. పోటీలకు జనప్రియ కవి ఏలూరి యంగన్న న్యాయనిర్ణేతగా వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతికి అనంతపురం నగరానికి చెందిన సొరపు గోవిందరాజులు, ద్వితీయ బహుమతికి విజయవాడ వాసి సత్యనారాయణరాజు, తృతీయ బహుమతికి అనంతపురానికి చెందిన పీజీ వెంకటేష్ కవితలు ఎంపికయ్యాయి. ప్రత్యేక బహుమతులకు చంద్రశేఖరరావు (విశాఖపట్నం), గంగాధర్ (హిందూపురం), పెండేకంటి పార్థసారథి (అనంతపురం), జమున (మహబూబ్‌నగర్), వైరాగ్యం ప్రభాకర్ (కరీంనగర్)ను ఎంపిక చేశారు. విజేతలకు మొమెంటో, నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను కొరియర్‌ద్వారా పంపుతామని టీవీ రెడ్డి వివరించారు.

మెరుగైన సేవలు అందించండి

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు, రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ అధికారులను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశించారు. విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పరిస్థితుల గురించి ఆరా తీశారు. రెవెన్యూ కలెక్షన్లు, విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ల గురించి చర్చించారు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయిన వెంటనే మరొకటి ఏర్పాటు చేయాలని సూచించారు. మరమ్మతులకు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రైతులు, వినియోగదారులను ఇబ్బందిపెట్టవద్దని సూచించారు. లైన్లు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో గుర్తించి, మార్చాలని ఆదేశించారు. నెలవారీ రెవెన్యూ కలెక్షన్లు విధిగా నిర్వర్తించి, సంస్థ పురోగతికి సహకరించాలని కోరారు. సమావేశంలో అనంతపురం జిల్లా ఎస్ఈ శేషాద్రి శేఖర్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వినతులు...

సీఎండీ సంతోష్‌రావుకు పలువురు ఉద్యోగులు తమ సమస్యలను వివరించి, వినతిపత్రాలను సమర్పించారు. విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాము తదితరులు సీఎండీని కలిశారు. జిల్లాల పునర్విభజన కారణంగా 2022 డిసెంబరులో అనంతపురం నుంచి 57 మందిని అక్రమంగా పుట్టపర్తికి బదిలీ చేశారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బదిలీలు చేపట్టాల్సి ఉండగా, అప్పటి అధికారులు కేవలం అనంతపురం సర్కిల్ పరిధిలోని వారిని మాత్రమే పుట్టపర్తికి బదిలీ చేశారని అన్నారు. ఈ కారణంగా బాధితులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆప్షన్లు ఇచ్చి తమను తిరిగి అనంతపురానికి బదిలీ చేయించాలని కోరారు. మూడు నెలల్లోపు తిరిగి అనంతపురం బదిలీ చేసేలా చర్యలు చేపడతామని సీఎండీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు హర్ష, అల్లాబకాష్, రాము, వెంకటరమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.




విద్యుత్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

వేదము వేంకటరాయశాస్త్రి (వర్ధంతి)



వేదము వేంకటరాయశాస్త్రి సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు, నాటక కర్త 1853 డిసెంబరు 21న చెన్నైలో జన్మించారు. మద్రాస్ క్రైస్తవ కళాశాలల సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించారు. గ్రాంధిక భాషావాది అయిన ఆయన సాహిత్య ప్రక్రియలో వ్యవహారిక భాషా ప్రయోగాన్ని విమర్శించారు. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ప్రతాపరుద్రీయం, ఉషా నాటకం వంటివి ఎంతో పేరొందాయి. మహోపాధ్యాయ బిరుదు, విద్యాదాన వ్రత మహోదధి, సర్వతంత్ర స్వతంత్ర సత్కారాలు, ఆంధ్ర విశ్వకళా పరిషత్ ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గౌరవం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. 1929 జూన్ 18న కన్నుమూశారు.

కేఎస్ సుదర్శన్ (జయంతి)



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు చీఫ్‌గా అంటే ఐదో సర్ సంఘ్ చాలక్‌గా వ్యవహరించిన కుప్పహళ్ళి సీతా రామయ్య సుదర్శన్ 1931 జూన్ 18న చత్తీస్‌ఘర్ రాష్ట్రంలో రాయ్‌పూర్‌లో జన్మించారు. వీరి తల్లిదండ్రులది మండ్య జిల్లా కుప్పహళ్ళి గ్రామం. సర్ సంఘ్ చాలక్‌గా 2000-2009 వరకు కొనసాగారు. బాల్యం నుంచే ఆర్ఎస్ఎస్‌లో క్రియాశీలకంగా ఉంటూ ప్రచారక్, తదితర ఉన్నత హోదాకు ఎదిగారు. జబల్‌పూర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి టెలీ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పట్టా అందుకున్నారు. సమాజానికి ఆయన చేసిన నిస్వార్థసేవకు మీరట్‌లోని శోభిత్ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2012 సెప్టెంబరు 15న కన్నుమూశారు.

గ్రామీణ విద్యార్థుల ప్రగతికి సహకారం

బాగేపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గ్రామీణ ప్రాంతాలలో పేద కుటుంబాల విద్యార్థులు ఉన్నారని వారి ప్రగతికి చేతనైన సహకారం అందించి ప్రోత్సహిస్తున్నట్టు ఏవీపీ చారిటబుల్ ట్రస్టుకు చెందిన మేనేజర్ బద్రినాథ్ అభిప్రాయపడ్డారు. పేదల సేవే దేవుడి సేవగా భావించి ట్రస్టు ద్వారా సాధ్యమైన మేరకు ప్రోత్సహిస్తున్నామన్నారు. తాలూకాలోని గూళూరు హోబళి పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులతోపాటు లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. డాక్టర్ జచని వసతి హైస్కూల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజానికి ఏదైనా సేవ అందించాలనే లక్ష్యంతో ట్రస్టు ఆదాయంలో కొంతమొత్తాన్ని పాఠశాల విద్యార్థులకు వినియోగిస్తున్నామన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో కన్నడ మీడియంలో వందశాతం సాధించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే రీతిన సత్తా చాటుకోవాలని, అత్యధిక మార్కులు సాధించినవారికి ట్యాబ్‌లు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా దాత బీఆర్ కృష్ణ, ట్రస్టు పదాధికారులు చంద్రశేఖర్, అనురాధ, హరినాథ్, చరితశ్రీ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజ్, ఉపాధ్యాయులు మహబూబ్ సాబి, శివ కుమార్, వైఎన్ నరసింహమూర్తి, తిప్పణ్ణ, మురళి, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాగు, పుస్తకాలతో విద్యార్థులు

సమాజంలో మార్పునకు చర్యలు అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దొడ్డబళ్ళాపుర, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అన్నింటినీ 'మనీ' స్థితియే నిర్ధారిస్తోందని, అధికారం నుంచి సంపద సులభంగా వస్తోందని దీని ద్వారా ప్రజాప్రభుత్వం హాస్యాస్పదం అవుతోందని, ఇది తొలగాలంటే వ్యక్తిత్వ సామాజిక స్పృహతో మెలగాలని స్టేట్ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ డైరెక్టర్ హులికల్ నటరాజ్ అభిప్రాయపడ్డారు. హులుకుడి కొండపై ఉన్న వీరభద్రస్వామి సభాభవనంలో ఏర్పాటైన కన్నడపక్ష కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మారాల్సింది ఇంటి వాస్తు కాదని, మనస్సు వాస్తు అన్నారు. బసవణ్ణ నుంచి కువెంపు వరకు పలువురు దార్శనికులు శాస్త్రీయ భావాలను బోధిస్తూ వచ్చారన్నారు. అయితే వాస్తవంలో మాత్రం మార్పు వెనుకంజలో ఉందన్నారు. ఈ అంశంపై ప్రజ్ఞావంతులు తీవ్రంగా చర్చించడం ద్వారా ప్రజల జీవితాలలో మార్పు వచ్చేలా తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కర్ణాటక సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ముకుందరాజ్ మాట్లాడుతూ భాష విషయంలో భావనాత్మకత ముఖ్యమన్నారు. సమావేశంలో మంజునాథ్, బీసీ బసవరాజ్, కర్ణాటక రణధీరపడె హరీశ్ బైర్ప, రాష్ట్ర రైతుసంఘం సీనియర్ ప్రముఖులు సులోచనమ్మ వెంకటరెడ్డి, సంజీవనాయక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి నిరంతర కృషి

చిక్కబళ్ళాపుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధి కోసం బ్రాహ్మణ మహాసభ నిరంతరం కృషి చేస్తుందని సంఘం అధ్యక్షుడు లక్ష్మి నారాయణ రావు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని విద్యాగణపతి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన మహిళా విభాగం వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం ధార్మిక కార్యక్రమాలలో బ్రాహ్మణులు తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. సంధ్యావందనం విధిగా పాటించాలని సూచిస్తూ అది కనీస ధర్మమన్నారు. ముఖ్యఅతిథిగా చిక్కబళ్ళాపుర జిల్లా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు, ఆల్ కర్ణాటక బ్రాహ్మణసంఘం వైస్‌ప్రెసిడెంట్ కృష్ణ, నాగభూషణ్‌రావ్ మాట్లాడుతూ బ్రాహ్మణులలో వర్గాలు ఉన్నా బ్రాహ్మణవాదం ఒక్కటేనని అదే ప్రజలను భక్తిమార్గంవైపు నడిపించేలా ప్రోత్సహించడమన్నారు. సమావేశంలో వివిధ సంఘాలకు చెందిన మురళీధర, మంగళ, ఉమా దేవి, పురుషోత్తం, అనురాధ, సుబ్రమణ్య, శ్రీనాథ్, రామప్రసాద్, లక్ష్మీనారాయణ, నళినికుమారి, వెంకటేశమూర్తి, శ్రీనివాసకార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశాన్ని ప్రారంభిస్తున్న బ్రాహ్మణ మహాసభ ప్రముఖులు

ఆలయాల్లో విశేష పూజలు

శిడ్లఘట్ట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠమాసం కృష్ణపక్షం సప్తమి పురస్కరించుకుని పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయంలో పూజలు చేశారు. అభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించిన అనంతరం ధూపదీపనైవేద్యాలు సమర్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా నగర పేటలోని కాళికాంబ కమటేశ్వర దేవాలయంలో ఉదయం విశేషపూజలు నిర్వహించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.



కాళికాంబకు అలంకరణ



రేణుకా ఎల్లమ్మదేవి

గాజా పరిస్థితిపై సౌహార్ద దినోత్సవం

జాలహళ్ళి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా దేశం గాజాలో ఇజ్రాయెల్ దేశం చేస్తున్న నరమేధం ఖండిస్తూ వివిధ రాజకీయ పార్టీల జాతీయ సౌహార్ద దినోత్సవాన్ని వయ్యాలికావల్ సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. మంగళవారం ఏర్పాటైన సమావేశంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, ఎస్‌యూసీఐ, ఏఐఎఫ్‌బీ పార్టీ నాయకులు పాల్గొని ప్రసంగిస్తూ మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని, ఇది యుద్ధం కాదని నరమేధమని అభిప్రాయపడ్డారు. యుద్ధాన్ని నిలపాలని అంతర్జాతీయ కోర్టు ఆదేశాలు ఉల్లంఘించబడ్డాయన్నారు. ఇప్పటికైనా యుద్ధం ఆపాలని కోరారు. యుద్ధం నిలిపి శాంతి చర్చలు జరపాలని ఆకాంక్షించారు.



వివిధ పార్టీల నాయకులు

బాధ్యతగా పనిచేయండి

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు నిరంతరం బాధ్యతతో పనిచేయాలని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం కేఎస్ఆర్టీసీ సంస్థ 2వేలమంది డ్రైవర్ కమ్ కండక్టర్‌గా ఎంపికైన వారికి నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేవలం మెరిట్ ఆధారంగా ఎంపిక చేశామని, ఎవరి సిఫారసులకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కొత్త డ్రైవర్లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కేఎస్ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత నియామకాలు జరిపారు.



నియామకపత్రాలు అందజేస్తున్న మంత్రి రామలింగారెడ్డి

పావగడ పోలీసులకు ఎస్పీ ప్రశంస

పావగడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పావగడ పోలీసులకు ఎస్పీ నుంచి ప్రశంసలు దక్కాయి. 13 కేసుల్లో నిందితుల సొమ్మును రికవరీ చేసినందుకుగాను మంగళవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, ఏఎస్పీ గోపాల్, డీఎస్పీ మంజునాథ్ పావగడ పోలీసులను అభినందించారు. తుమకూరు, చిక్కబళ్లాపురం, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ద్విచక్రవాహనాలు, చైన్‌స్నాచింగ్ తదితర కేసుల్లోని నిందితులను పట్టుకున్నారు. రూ.42లక్షలు విలువచేసే 36 ద్విచక్రవాహనాలు, రూ.1.85లక్షల విలువచేసే 190 గ్రాముల బంగారం, 2.6 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో కీలకపాత్ర పోషించిన పావగడ రూరల్ సీఐ గిరీష్, ఎస్ఐ విజయ్‌కుమార్, నాగేష్, నవీన్, తలవార్‌రాజు, దీపక్ తదితరులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



పావగడ పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, సిబ్బంది

గ్యారెంటీల పేరుతో ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

జేడీఎస్ రాష్ట్ర యువ అధ్యక్షుడు నిఖిల్

పావగడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల నుంచి అధిక పన్నులు వసూలు చేస్తూ, గ్యారంటీల పేరిట రాష్ట్రాన్ని నిలువు దోపిడీచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర యువఅధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆంజనేయశెట్టి కల్యాణమండపంలో నిర్వహించిన జెడీఎస్ పార్టీ మిస్డ్‌కాల్ అభియాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ తాలూకాలో నిధులను దుర్వినియోగం చేసి తెలంగాణలో నడిచిన ఎన్నికలకు ఆ నిధులను వాడుకున్న ప్రభుత్వ కాంగ్రెస్ అని అన్నారు. కుమారస్వామి అధికారంలోకి వస్తే పంచరత్న యోజన పథకాలను ఇస్తామన్న హామీలను విమర్శించే హక్కు ఏ పార్టీకి లేదని అన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి పేరిట మోసం చేస్తూ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడం సిద్ధరామయ్యకు సిగ్గుచేటన్నారు. 2028లో ముచ్చటగా మూడోసారి కుమారస్వామిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రజలు పెట్టుకున్నారని అందుకు మిస్డ్‌కాల్ చివరి నంబరు 2028అని రావడం కూడా అదృష్టమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు రష్మిక, పావగడ తాలూకా అధ్యక్షులు ఈరన్న, గోవిందబాబు, ఎస్‌కె రెడ్డి, అంజప్ప, జెడీఎస్ నాయకులు సురేంద్ర, చిన్న మల్లయ్య, జిల్లా మహిళ అధ్యక్షురాలు తహీరాబాను, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిఖిల్ కుమారస్వామి

మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప సెల్‌ఫోన్ చోరీ

నిఖిల్ కుమారస్వామి పావగడలో మిస్డ్‌కాల్ అభియాన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పావగడ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ఫోన్ చోరీకి గురైంది.

శబరిమల మార్గంలో
కర్ణాటక భక్తుడి మృతి

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): శబరిమల సన్నిధానానికి పంబ నుంచి వెళుతూ కర్ణాటకలోని రామనగరకు చెందిన భక్తుడు ప్రజ్వల్ (20) మృతిచెందారు. కొండపైకి వెళుతున్న ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన సోమవారం జరిగింది. ప్రజ్వల్ మృతదేహాన్ని సొంతప్రాంతానికి తరలించే ఖర్చును తామే భరిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.

జొన్న నిల్వల పరిశీలన



జొన్న నిల్వల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా పౌర ఆహార శాఖ అధికారి షకీనా

కంప్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిక్కజాగనూరు రోడ్డులో ఉన్న గిడ్డంగుల్లో వుంచిన జొన్నల నిల్వలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి షకీనా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ లారీల ద్వారా వచ్చే లోడు జొన్నల్ని వృథా కాకుండా నిల్వలు చేసుకోవాలని అధికారులకు సూచించారు. గిడ్డంగుల్లో ఉంచిన జొన్నల్ని రానున్న కాలంలో ప్రజలకు అందిస్తుందన్నారు. ఈ వర్షాకాలంలో గిడ్డంగుల్లో తడవకుండా జాగ్రత్త వహించాలన్నారు. విధుల్లో ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వారితోపాటు కంప్లి తాలుకా పౌరాహారాల శాఖ అధికారి విరూపాక్షిగౌడ, అమరేష్, ఇర్ఫాన్, సిబ్బంది పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న జనం

పరిగి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవామందిరం, కొడిగెనహళ్లి బిందునగర్, పరిగి గ్రామాల్లో మూడు నెలల్లోపే దాదాపు 13 చోరీలు చేసి పోలీసులకు సవాల్ విసురుతున్నారు దొంగలు. సోమవారం రాత్రి కొడిగెనహళ్లిలో ఎస్బీఐ పాయింట్‌లో, మూడుచిల్లర దుకాణాల షెట్టర్లను పగలకొట్టి అందులో నగదును దోచుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి క్లూస్ టీమ్‌ద్వారా ఆధారాలను సేకరించారు. వరుస చోరీలతో ప్రజలు ఇల్లు విడిచి వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా రాత్రిపూట పోలీస్ సిబ్బంది గస్తీ పటిష్టంగా చేపట్టామన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

విధి నిర్వహణలో బస్సు డ్రైవర్ మృతి

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఆర్టీసి డిపోకి చెందిన డ్రైవర్ నాగరాజు (49) విధినిర్వహణలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి డ్రైవర్లు, కుటుంబ సభ్యులు తెలిపారు. సంతేబిదనూరికి చెందిన నాగరాజు హిందూపురం నుంచి విజయవాడకు వెళ్లే బస్సుకి డ్రైవర్‌గా వెళ్లాడు. మంగళవారం ఉదయం విజయవాడ నుంచి హిందూపురానికి వస్తుండగా తాడిపత్రి సమీపంలోకి వచ్చే సరికి ఛాతిలో నొప్పి అధికంగా ఉందని, అక్కడ ఉన్న మరో డ్రైవర్‌కి చెప్పాడు. దీంతో అతడు డ్రైవ్ చేస్తూ తాడిపత్రిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే నాగరాజు మృతిచెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మృతుడుకి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తె ఉన్నారు.

చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్

మడకశిర టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ చైర్మన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డిలపై 15న అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. 20మంది కౌన్సిలర్లుకు 15 మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. దీంతో వారు ఇద్దరు పదవులు కోల్పోయినట్లు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో త్వరలో మడకశిర నగర పంచాయతీకి కొత్త చైర్మన్ ఎన్నికకు లైన్‌క్లియర్ అయినట్లు అయ్యింది. గతంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ హాజరై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. అందులో నైతికంగా టీడీపీ పార్టీ విజయం సాధించింది. దీంతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. నివేదిక ఆధారంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

ఉపాధ్యాయులు
విలువలకు ప్రతిరూపంగా ఉండాలి

చిక్కబళ్ళాపుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భావితరాలను తీర్చే ఉపాధ్యాయులు విలువలకు ప్రతిరూపంగా ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ముద్దేనహళ్ళిలోని సత్యసాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్, వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీ సంయుక్తంగా ఉన్నత విద్యలో విలువల ప్రమేయం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యలో విలువలను స్వీకరించడంపై ఉపాధ్యాయుల పాత్ర, అభివృద్ధి తదితర అంశాలను చర్చించారు. ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ మీనాక్షి బిస్వాల్, ఆమె బృందం సమర్పించారు. అజయ్ కుమార్‌సింగ్ ఒక సంక్షిప్త నివేదికను సమర్పించగా సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ సంస్థలకు చెందిన 150మందికిపైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులగణనలో మాతృభాషకు ప్రాధాన్యం ఇద్దాం

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం చేపట్టిన కులగణన సందర్భంగా దేశంలో వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న 13కోట్లమంది తెలుగువారు మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు ఏ రాధాకృష్ణరాజు అభిప్రాయపడ్డారు. రెండు తెలుగురాష్ట్రాల ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాలలో ఉన్న కోట్లాదిమంది ప్రజలు కులగణన చేపట్టే మాతృభాష కాలంలో 'తెలుగు' నమోదు చేసుకోవాలని సూచించారు. తెలుగుభాష నాల్గోస్థానానికి పడిపోయిందని, తెలుగుభాషకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బెంగళూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పీయూ కీలకమైనదని రిలెవెన్స్ ల్యాబ్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ వైస్‌ప్రెసిడెంట్ రవీంద్రవర్మ అభిప్రాయపడ్డారు. సౌందర్యకళాశాలలో పీయూ విద్యార్థులకు మంగళవారం ఓరియంటేషన్ జరిపారు. ప్రపంచం సాంకేతిక రంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆ దిశగానే విద్యార్థులు నైపుణ్యత సాధించాలన్నారు. సౌందర్య గ్రూప్ సంస్థల ఫౌండర్ మంజప్ప, సీఈఓ కీర్తన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రేపు తాలూకా సమస్యలపై సమావేశం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బాగేపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సీపీఎం తాలూకా సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న పలు డిమాండ్లు, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమావేశం నిర్వహించదలిచారు. తాలూకా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే సమావేశానికి తాలూకాస్థాయి అధికారులు పాల్గొనాలని కోరుతూ తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని తహసీల్దార్‌కు వివరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ముళబాగిలు, జూన్ 17, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించు కుని అమ్మవారికి విశేషపూజలు, అలంకరణలు నిర్వహించారు. వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో భజనలు సాగాయి. గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమం పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం కాశీ విశ్వనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు.



విశేష అలంకరణ

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

మడకశిర రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు గంటలు కూడా సరిగా విద్యుత్ సరఫరా ఉండకపోవడంతో ఇబ్బందులుపడుతున్నట్లు చెబుతున్నారు. వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరా మెరుగయ్యేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ ఏడీ రఘును వివరణ కోరగా విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను తొలగిస్తున్నారని, అందుకోసం విద్యుత్ సమస్య ఏర్పడిందన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1605.27	1582.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	14,621	944
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	160	1,244
నీటి నిల్వ (టీఎంసీలు)	29.14	6.07

సాహిత్య సమ్మేళనానికి అదనపు నిధులు
మంజూరు చేయండి



మంత్రి శివరాజ్ తంగడికి వినతిపత్రం అందిస్తున్న కన్నడ సాహిత్య పరిషత్ సభ్యులు

బళ్లారి సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలో జరగనున్న 88వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి కన్నడ సాంస్కృతిక శాఖ వార్షిక కార్యాచరణ ప్రణాళికలో ఇప్పటికే పది కోట్లు కేటాయించారు. బళ్లారిలో జరగనున్న సమ్మేళనానికి రూ.40 కోట్ల అంచనా గ్రాంట్ అవసరం. వార్షిక కార్యాచరణ ప్రణాళికలో విడుదల చేసిన గ్రాంట్ కంటే అదనంగా రూ.30కోట్లు మంజూరు చేయాలని కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడగిని కారటగి వారి నివాసంలో కలిసి బళ్లారి జిల్లా కన్నడసాహిత్యపరిషత్ సభ్యులు వినతి పత్రాన్ని అందించారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప, శరణగౌడ పోలీస్ పాటిల్, బళ్లారి జిల్లా సంచాలకులు కప్పగల్ చంద్రశేఖర్ ఆచార్, సిద్దరామ సిరిగేరి, వీరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితుడు

బళ్లారిరూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని గోడేహాళ్ సమీపంలో ఉన్న తిరుమల స్కూలులో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను క్రమంగా స్కూల్లో చేర్పించే సమయంలో పలక బలపం తీసుకుని అమ్మనాన్నతో పాటు దైవభక్తితో అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూలు కరెస్పాండెంట్ యల్లప్ప, హెచ్‌ఎం నాగరాజుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మంత్రి సహపంక్తి భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప

బళ్లారిరూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని పటేల్ నగర్ ప్రాథమిక హిరియ పాఠశాలలో విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులను స్కూలు విషయాల పట్ల ఆయన అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, డీడీపీఐ ఉమాదేవి, మీడియా కోఆర్డినేటర్ వెంకటేష్ హెగ్డే, గ్యారెంటీ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్ల అందజేత



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్‌ఐ కాళింగ

బళ్లారిరూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా ఎస్‌ఐ కాళింగ నేతృత్వంలో ప్రజలు పోగొట్టుకున్న 13 మొబైళ్లను రికవరీ చేసి సంబంధితులకు అందజేశారు. వారు ఎస్‌ఐకు అభినందనలు తెలిపారు.

ప్రాంతీయ అసమానతలను తొలగించాలి

● అసమానతల నివారణ కమిటీ ఛైర్మన్ గోవిందరావు



మాట్లాడుతున్న ఛైర్మన్ గోవిందరావు, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ రంగాల సూచికల ఆధారంగా ప్రాంతీయ అసమతుల్యతలను తొలగించాలని ప్రాంతీయ అసమతుల్యత నివారణ కమిటీ ఛైర్మన్ ఎం.గోవిందరావు అన్నారు. జిల్లాస్థాయి ప్రాంతీయ అసమతుల్యతలను తొలగించడంపై నగరంలోని జిల్లా కలెక్టర్ సమావేశ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. డాక్టర్ నంజుండప్ప 2002 నివేదికలో అప్పటి 176 తాలూకాలను వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, అభివృద్ధి చెందిన తాలూకాలుగా 4 వర్గాలుగా వర్గీకరించి అందుకు అనుగుణంగా నిధుల కేటాయింపులను సిఫార్సు చేశారన్నారు. గుర్తించిన తాలూకాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.31వేల కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. అసమతుల్యత పెరిగినప్పుడు ప్రాంతాలు వెనకబడిపోతాయన్నారు. నంజుండప్ప నివేదిక అమలు వల్ల అభివృద్ధి ఎలా సాధ్యమైందో సూచిక ఆధారంగా చూపుతామన్నారు. అది వెనకబడి ఉంటే దానికి గల కారణాలను, ఏ రంగంలో వెనుకబడి ఉందో కమిటీ సమీక్షిస్తుందన్నారు. తలసరి ఆదాయం విద్య, ఆరోగ్యం, ఇతర రంగాలలో మెరుగుదల, వృద్ధిని కమిటీ పరిశీలిస్తుందని ఆయన అన్నారు. ప్రాంతీయ అసమతుల్యతలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 2024లో ఆర్థిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ వ్యవసాయం, పరిశ్రమలు, ఆర్థిక మౌలిక సదుపాయాలు, సామాజిక మౌలిక సదుపాయాలు, ఆర్థిక, సాంకేతిక మౌలిక సదుపాయాలు వంటి రంగాల అభివృద్ధికి సూచికను గుర్తించి నిర్దేశిస్తుందన్నారు. అనంతరం కమిటీ ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుందని ఆయన అన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి ముఖ్యమని, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించడం, వలసలను తగ్గించడం చాలా ముఖ్యమని జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అనేక కార్యక్రమాలు ప్రారంభించామని ఆయన అన్నారు. కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ ఇక్కడ ఉత్పత్తి అయ్యే పంటలకు విలువను జోడించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. వస్త్ర కేంద్రం, మైనింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, కోల్డ్‌స్టోరేజ్ యూనిట్లు, పంటలకు మద్దతు ధర, నీటిపారుదల, ఆధునిక ఆస్పత్రులు, చిన్న వ్యాపారాలకు మరిన్ని ప్రోత్సాహకాలు, విద్యాసంస్థలకు ప్రాథమిక మౌలిక సదుపాయాలు ఇతర అంశాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో కర్ణాటక ప్రాంతీయ అసమతుల్యత నివారణ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ బాగల్కోటి, జిల్లా పంచాయతీ సీఈఓ మహ్మద్ హారీస్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ సోమసుందర్, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సంతోష్ సప్పండి, జిల్లా పారిశ్రామిక కేంద్రం సంయుక్త డైరెక్టర్ సోమశేఖర్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఉమాదేవి, వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు, స్థానిక సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

● డీహెచ్ఓ రమేశ్‌బాబు



మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటి,జూన్ 17(ఆంధ్రజ్యోతి): అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు వాడాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు సూచించారు. నగరంలోని బ్రూస్‌పేట ఆరోగ్య కేంద్రం బట్టి ప్రాంతంలోని కొరచగేరి కాలనీలో బసమ్మ మెమోరియల్ ప్రాథమిక,ఉన్నత పాఠశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ, పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖల సహకారంతో మంగళవారం నిర్వహించిన అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాలకు అతిసార ప్రధాన కారణమన్నారు. దీని వల్ల 10 శాతం మంది పిల్లలు మరణిస్తున్నారని అన్నారు. పిల్లలకు 14 రోజుల పాటు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఇవ్వడం వల్ల అతిసారను నియంత్రించవచ్చన్నారు. ఇది పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతుందని ఆయన అన్నారు. 'జీరో చైల్డ్ డెత్స్ ఫ్రం అక్యూట్ డయేరియా' అనే నినాదంతో 2014-15 నుంచి రాష్ట్రంలో అక్యూట్ డయేరియా కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025-26 సంవత్సరంలో జూన్ 16 నుంచి జూలై31 వరకు జిల్లా అంతటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1,97,264 మంది పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. అవసరమైన వారికి జింక్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రత, చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, విరేచనాలతో బాధపడుతున్న పిల్లలను ఎలా చూసుకోవాలి, ఎలా చికిత్స చేయాలి అనే దానిపై అవగాహన కల్పించేందుకు వైద్య బృందాలు గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్లను సందర్శించాలన్నారు. తల్లిదండ్రులు ఇందుకు సహకరించాలని అభ్యర్థించారు. హెడ్‌మాస్టర్ రాజశేఖర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మురికివాడ ప్రాంతంలోని పాఠశాలలో 600మందికి పైగా పిల్లలు చదువుతున్నారని, వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పిల్లల్లో అవగాహన కల్పించడంలో ఆరోగ్య శాఖ కృషి అభినందనీయమని అన్నారు. వ్యాధులు వ్యాపించకుండా ఉండటానికి వైద్యులు సూచించిన విధంగా భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులు కడుక్కోవాలని, తయారుచేసిన 24గంటల్లోపు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఉపయోగించాలని పిల్లలకు అవగాహన కల్పించాన్నారు. బ్రూస్‌పేట నగర ఆరోగ్య కేంద్రం అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్పనవర్, ప్రధానోపాధ్యాయుడు చెన్నన్ గౌడ, ఉపాధ్యాయులు నాగరాజ్, విరూపాక్షి, జిల్లా నర్సింగ్ అధికారి గిరీశ్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ అధికారులు చైత్ర, ప్రసన్న జ్యోతి, హెల్త్‌ఇన్‌స్పెక్టర్లు శిల్ప, దీప, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేనే డ్రైవర్..!

● ట్రాక్టర్‌పై నల్లముచ్చుకోతి విన్యాసాలు..



కురుగోడు పట్టణంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా మారిన నల్లముచ్చుకోతి

కంప్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కురుగోడు పట్టణంలో ముష్టిగట్టి రోడ్డులో ఓ ట్రాక్టర్‌పై కొండల్లో ఉన్న నల్లముచ్చుకోతులు చెట్లపైనున్న కోతులు పరిగెత్తుకుంటూ వచ్చి ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్‌ను తోసేసి డ్రైవర్ సీటులో కూర్చుని స్టీరింగ్ పట్టుకుని హల్‌చల్ చేశాయి. నల్లముచ్చుకోతి ముష్టగట్టి రోడ్డుపైకి ట్రాక్టర్లు రావాలన్నా డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఎటువైపు నుంచి పరిగెత్తుకుని వచ్చి తమపై దాడి చేస్తాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎంత మంది కేకలు వేసినా శబ్దాలు చేసినా వాటిని అవి లెక్కచేయకుండా ట్రాక్టర్ రాగానే డ్రైవింగ్ సీట్లో కూర్చుంటున్నాయి. ఈ నల్లముచ్చుకోతి మాత్రం విచిత్రంగా ప్రవర్తిస్తూ ట్రాక్టర్ డ్రైవర్‌గా మారిపోయింది. స్టీరింగ్ తిప్పుతూ హారన్‌కొడుతూ క్లచ్, బ్రేక్, తొక్కుతూ విన్యాసాలు చేస్తూ ప్రజల్ని ఆకట్టుకుంటుంది. ట్రాక్టర్ దిగమంటే నేను దిగను అంటూ కోతి తల ఊపుతోంది. గంట, రెండు గంటల అనంతరం కోతికే విసుగు వచ్చి సీట్ నుంచి బయటకి వెళ్లిపోయింది. దీంతో డ్రైవర్ ఊపిరిపీల్చుకున్నాడు.

'అవకాశాలను అందిపుచ్చుకోవాలి'



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హరీశ్ కుమార్ సరదాన్

రాయచూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని కర్ణాటక ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ హరీశ్ కుమార్ సరదాన్ సూచించారు. నగర సమీపం యరమరస్‌లోని హైదరాబాద్ కర్ణాటక ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సర్.ఎం.విశ్వేశ్వరయ్య స్మారక ఇంజనీయరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం పట్టా ప్రదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్న ప్రస్తుత తరుణంలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు తమ విద్యార్హలతకు తోడు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలన్నారు. దీనికితోడు క్రమశిక్షణ పట్టుదల అవసరమని, ఆ దిశగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు.

పాలస్తీనాపై దాడులను ఆపాలి

రాయచూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ సైన్యం జరుపుతున్న దాడులను ఆపాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దాడులను నిరసిస్తూ మంగళవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ సైన్యం నివాస గృహాలు, పాఠశాలలు, ఆస్పత్రులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న దాడులు గర్హనీయమన్నారు. ప్రపంచం ఇజ్రాయిల్‌ను ఉగ్రవాద దేశంగా గుర్తించి వెలివేయాలని డిమాండ్ చేశారు. కాగా దాడులను నిలిపివేసి చర్చలకు మార్గం సుగమం చేయాలనే డిమాండ్ చేస్తు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా వామపక్ష నాయకులు నినాదాలు చేశారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు



మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే బీఎం నాగరాజు, బీఎం సతీష్

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

● మంత్రి సతీష్ జార్కిహోళి

సిరుగుప్ప, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పీడబ్ల్యూడీ మంత్రి సతీష్ జార్కిహోళి పోలీసులను ఆదేశించారు. సిరుగుప్ప పట్టణ అతిథి గృహానికి విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యే బీఎం నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీఎం సతీష్, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అనంతరం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీదర్ నుంచి చామరాజనగర్‌కు వెళ్లే 150ఎన్‌హెచ్ రహదారి సింధనూరు నుంచి బళ్లారి వరకు అధ్వాన స్థితికి చేరిందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేసినందుకు కేసు నమోదు చేసి ఆస్తులను జప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇందుకు సీఐ హనుమంతప్ప ఇప్పటికే రెండుసార్లు ఆయనపై కేసు దాఖలైనట్లు తెలిపారు. మరోసారి ఆయనపై కేసు నమదు చేయాలని మంత్రి సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరిబసప్ప, కౌన్సిలర్లు అప్పాజీ నాయక, గణేష్, అబ్దుల్ నబీ, మోహిద్దీన్, తాలుకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు పీరా హుస్సేన్, నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన కల్పించాలి

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే



అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ సీఈఓ

రాయచూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న వేళ జిల్లాలో అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే సూచించారు. మంగళవారం నగరంలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ (డీహెచ్ఓ) కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాంతులు, విరేచనాలకు తీసుకోవల్సిన జాగ్రతలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. అదే సమయంలో పాఠశాలలు, కళాశాలల్లో తీసుకోవల్సిన జాగ్రతల గురించి సంబందిత శాఖ అధికారులతో చర్చించాలన్నారు. అతిసార ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రతలపై విద్యాశాఖ ఆరోగ్య శాఖలు ఇతర శాఖల సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పీడియాట్రిషన్ సంజీవ్ శెట్టి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార అత్యంత ప్రమాదకరంగా ఉంటుందని ఆ సందర్భంగా తీసుకోవల్సిన జాగ్రతల గురించి ఆయన ప్రజలకు వివరించారు.

గ్యారెంటీలు సక్రమంగా అందించాలి



శ్రీనివాసరావు, శ్రీకుమార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కంప్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేసిన గ్యారెంటీ పథకాలు సక్రమంగా వారికి అందేలా చూడాలని గ్యారెంటీ పథకాల అనుష్ఠాన సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం కంప్లి పట్టణంలో జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం తాలుకా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యారెంటీ పథకాలు ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్యారెంటీ పథకాలలో గృహ జ్యోతి, యువనిధి, శక్తి యోజన, అన్న భాగ్య, గృహలక్ష్మీ యోజన తదితర పథకాలు ప్రతి పేద కుటుంబానికి అందేలా చూడాలన్నారు. పథకాల్లో ఏ అధికారులుగానీ, సిబ్బందిగానీ నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలకు సరైన సమయానికి బస్సులు, విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి, పేద కుటుంబాల వారికి పథకాలు అందుతున్నాయన్నారు.సమావేశంలో గ్యారెంటీ యోజనల సభ్యులు వీధి అంశాలపై చర్చించారు. అనంతరం శ్రీనివాసరావుకు ఈవో శ్రీకుమార్‌కు సభ్యులు అభినందించి సన్మానించారు. ఈవో శ్రీకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



సన్నాపురం నదిలో సంచరిస్తున్న మొసలి

కంప్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో మొసళ్లు తిరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామప్రజలు కోరారు. నాలుగు రోజుల క్రితం వేదమూర్తి అనే విద్యార్థిపై మొసలి దాడి చేసే విషయం తెలిసిందే. దీంతో నదిలోకి వెళ్లేందుకు ప్రజలు, రైతులు భయాందోళనలు చెందుతున్నారు. సోమవారం సాయంత్రం సన్నాపురం వద్ద తుంగభద్ర నదిలో మొసలి రైతులకు కనిపించిందన్నారు. రైతులు కేకలు వేయడంతో మొసలి నదిలోకి వెళ్లిపోయిందన్నారు. గ్రామస్థుడు జడెప్ప మాట్లాడుతూ రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు భయభ్రాంతులను గురవుతున్నారు. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

బాగెవడే కాలువ రైతుల అన్నదానం

సిరుగుప్ప, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పుష్కలంగా వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని బాగవడే కాలువ చివరి ఆయకట్టు రైతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవి ఆలయ ఆవరణలో భాగవడే కాలువ చివరి ఆయకట్టు రైతులు ప్రతి ఏడాది మాదిరిగానే దేవికి పూజలు నిర్వహించి అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది పుష్కలమైన వర్షాలు పడి, అధిక దిగుబడులు రావాలని అమ్మవారిని ప్రార్థించారు. వేలాది మంది పట్టణ ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



భక్తులకు అన్నం వడ్డిస్తున్న రైతు

హోసూరు జోన్

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు



నిందితులు

హోసూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన మేస్త్రీ హత్యకేసులో ముగ్గురికి జీవితఖైదు విధిస్తూ హోసూరు కోర్టు సంచలన తీర్పునిచ్చింది. తళి సమీపంలోని ఉప్పరపల్లిలో ఆనంద్ యాజమాన్యంలోని స్థలంలో ముగ్గురు మేస్త్రీలు పనిచేసేవారు. 2015 ఫిబవరి 13న అశోక్ ఒంటరిగా వంట చేస్తున్నాడు. మద్యంమత్తులో బైక్‌పై అక్కడికి వచ్చిన ముగ్గురు యువకులు సరిహద్దులోని ఆనేకల్‌కు వెళ్లేందుకు అడిగారు. అశోక్ తెలియదు అనడంతో ఆగ్రహించిన వ్యక్తులు అతడి చెంపపై కొట్టి, మొబైల్ లాక్కున్నారు. అశోక్ ఛాతీపై కత్తితో పొడిచి బైక్‌పై పారిపోయారు. అంతలోగా అతడి స్నేహితులు వేలు, శ్రీధర్‌లు రాగా రక్తపుమడుగులో ఉన్న అతడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మరుసటిరోజు ఉదయం అశోక్ మృతి చెందాడు. తళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో బెంగళూరు సమీపంలోని చవాన్ అలియాస్ బబ్లు (33), కేశవమూర్తి అలియాస్ కేశవ (33), నల్లసంద్రకు చెందిన శాంత అలియాస్ శాంతకుమార్ (27) నిందితులపై నేరం రుజువైంది. సోమవారం కేసు విచారించిన న్యాయమూర్తి సంతోష్ తీర్పును ప్రకటించారు. నిందితులు బబల్లు, కేశవ, శాంతకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు.

15 రూట్లలో మినీ బస్సులు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్

హోసూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): హోసూరు పరిధిలో పలు గ్రామాలకోసం 15 రూట్లలో 13 మినీ బస్సులను ప్రారంభించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్, కార్పొరేషన్ మేయర్ సత్య జెండా ఊపి ప్రైవేట్ మినీబస్సులు నడిపేందుకు అనుమతులు మంజూరు చేశారు. కృష్ణగిరి జిల్లాలో 55 కొత్త మార్గాలను గుర్తించగా 73 వాహనాలకు కొత్తరూట్ పర్మిట్లు మంజూరు చేశారు. కొండ గ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సులను రోజుకు నాలుగైదు ట్రిప్పులు నడుపుతున్నారు. ప్రస్తుతం మినీ బస్సులు అందుబాటులోకి రావడంతో గంట లేదా గంటన్నరకు ఒక బస్సు అందుబాటులోకి రానుంది. కాగా హోసూరు కార్పొరేషన్ పరిధిలో మినీ బస్సుల అవసరాన్ని గుర్తించి మరిన్ని రూట్లకు అనుమతి ఇవ్వడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రాంతీయ రవాణా అధికారి ప్రభాకర్, ప్రాంతీయ రవాణా ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, చెలియన్, కార్పొరేషన్ ఆరోగ్యస్థాయి కమిటీ ఛైర్మన్ మాదేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక విందు



విందులో భక్తులను పలకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నల్లూరు గ్రామంలోని కరదమ్మదేవి ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా సుమారు 50వేల మందికి కృష్ణగిరి జిల్లా డీఎంకే కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్ నేతృత్వంలో ఉత్సవాన్ని నిర్వహించారు. చాలా సంవత్సరాల తర్వాత ఆలయాన్ని పునరుద్ధరించిన తర్వాత 11రోజులపాటు ఉత్సవం నిర్వహించారు. ముగింపురోజు సోమవారం వేలాదిమంది భక్తులు పాల్గొనడంతో మాంసాహార విందును ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 5వరకు శాకాహార, మాంసాహార విందులో సుమారు వేలాదిమంది భక్తులు ఆరగించినట్టు తెలుస్తోంది.